క్లుప్తంగా

చంద్రబోస్‌కు సన్మానం



చంద్రబోస్‌ను సన్మానించిన శ్రీనివాస్

మణికొండ: తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి చేర్చి అవార్డును దక్కించుకున్న సినీ గేయ రచయిత సుభాష్ చంద్రబోస్‌కు సన్మానాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భారతీయ జనతాపార్టీ ఎస్సీ సెల్ ప్రొటోకాల్ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ ఆదివారం మణికొండలోని చంద్రబోస్ నివాసానికి వెళ్లి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి అవార్డుల్లో ఒకటైన ఆస్కార్ అవార్డు సాధించిన ఘనత తెలుగువాడైన చంద్రబోస్‌కు దక్కడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

మంచిరేవులలో బలగం సినిమా ప్రదర్శన



బలగం సినిమా చూస్తున్న గ్రామస్తులు

మణికొండ: మానవ సంబంధాల విలువను తెలియజెప్పిన బలగం సినిమాను నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో ఆదివారం రాత్రి ప్రదర్శించారు. స్థాని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ కమిటీ చైర్మెన్ పొన్న రమేష్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రామంలో ఈ విషయం అందరికి తెలిసేలా డప్పు చాటింపు వేయించారు. ప్రజాభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సినిమా ప్రదర్శనకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు మెడల్స్ అందజేసిన మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

జియాగూడ: యువత క్రీడల్లో రాణించాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ గౌతమ్‌మోడల్స్ స్కూల్‌లో మిత్ర అసోసియేట్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డ్స్–2023 ద్వారా ఇంటర్ డో జాంగ్ త్వైకాండో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ ప్లేయర్, నేషనల్ రిఫరి మంగి కిశోర్‌కుమార్, త్వైకాండో గ్రాండ్ మాస్టర్ సంపూర్ణం పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మిత్రకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 16న జియాగూడ ఎస్‌బీపీ గార్డెన్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యావికాస్ అవార్డులను బహూకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నరహరిచారి, ముఖేష్ జోగి, కేశవ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

శేరిలింగంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నేతాజీనగర్‌లో నిర్వహించిన గడప గడపకు బీజేపీ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేతాజీనగర్‌లో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో చేసిందేమీ లేదని ఆరోపించారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, రాధ కృష్ణయాదవ్, వినోద్‌రావు, విటల్, హన్మంతు నాయక్, కృష్ణయాదవ్, జితేందర్, వినయ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు..

- మండల పరిధిలో 90 శాతం ఆస్తి పన్ను వసూళ్లు
- కొత్త పంచాయతీల్లో 100 శాతం వసూలు
- వసూళ్లలో మెరుగైన ఫలితాలు



ననాజీపూర్ పంచాయతీ కార్యాలయం

శంషాబాద్ రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో మండల పరిధిలోని పంచాయతీలు మెరుగైన ఫలితాలు సాధించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 27 పంచాయతీల్లో 90 శాతం వసూళ్లు కాగా.. ఇంకా రూ.25,28,139 బకాయిలు ఉన్నాయి. పన్ను వసూళ్లల్లో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపడంతో వసూళ్ల శాతం పెరిగింది. నగదు, ఆన్‌లైన్ ద్వారా రూ.2,17,53,521 పన్ను వసూలు చేశారు.

వంద శాతం వసూళ్లు

మండలంలోని మదన్‌పల్లి పాతతండా, సుల్తాన్‌పల్లి, అలీకోల్‌తండా, చిన్నగోల్కొండ, జూకల్, రషీద్‌గూడ, పిల్లోనిగూడ, ననాజీపూర్ పంచాయతీల్లో వంద శాతం వసూళ్లు జరిగాయి. వీటిలో సుల్తాన్‌పల్లి, చిన్నగోల్కొండ, జూకల్, ననాజీపూర్ పంచాయతీలు మినహా మిగిలినవి కొత్త పంచాయతీలే కావడం గమనార్హం. ఇక పెద్దషాపూర్‌తండా, కాచారం, ఘాంసిమియాగూడ, మల్కారం, మదన్‌పల్లి, చొదరిగూడ, శంకరాపురంలో 90 శాతం పైగా పన్ను వసూళ్లు నమోదయ్యాయి.

అత్యల్పంగా 78 శాతం..

అత్యల్పంగా బహదూర్‌గూడ పంచాయతీల్లో 78 శాతం పన్ను వసూలు చేశారు. తర్వాతి స్థానంలో పెద్దతూప్రాన్, రామంజాపూర్, మదన్‌పల్లి కొత్త తండాలో 83 శాతం వరకు వసూళ్లు జరిగాయి. మేజర్ పంచాయతీలైన పాల్మాకుల, నర్కూడ, పెద్దషాపూర్‌లో 85 నుంచి 89 శాతం వరకు వసూళ్లు నమోదయ్యాయి.

పాత బకాయిలు మోపెడు..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లు మంచి ఫలితాలు సాధించగా.. పాత బకాయిలు పేరుకుపోయాయి. రూ.12,90,507 పాత బకాయిలు ఉన్నాయి. నర్కూడలో అత్యధికంగా రూ.3,74,336 బకాయిలు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ



ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో వసూళ్ల శాతం పెరిగింది. సిబ్బంది ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బకాయిలను వీలైనంత వరకు వసూలు చేయడానికి కృషి చేస్తున్నాం.

– ఉషాకిరణ్‌రెడ్డి, ఎంపీడీఓ, శంషాబాద్.

ఈస్టర్ గుట్ట స్థలాన్ని కేటాయించేందుకు కృషి



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రైస్తవ సోదరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఈస్టర్ గుట్ట స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఈస్టర్ గుట్టపై ఆదివారం నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు ప్రాంతాలకు చెందిన వందలాది మంది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 70 ఏళ్లగా ఈస్టర్ గుట్టపై ప్రతి సంవత్సరం ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ స్థలాన్ని కేటాయించాలని క్రైస్తవులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, వైఎస్ఆర్‌టీపీ చేవెళ్ల ఇన్‌చార్జి కె.ఎస్.దయానంద్, రగడంపల్లి శ్రావణ్, కోరని బాల్‌రాజ్, ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మణికొండ బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్‌లో చేరారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మాల్యాద్రినాయుడు వైఖరి కారణంగానే బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ హాజీ, కౌన్సిలర్‌లు కె. లక్ష్మీనారాయణ, పురుషోత్తం, నాయకులు మల్లేష్, తాజుద్దీన్, సుబ్బారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలి



మణికొండ దిలైఫ్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న బ్రదర్ అనిల్‌కుమార్

మణికొండ: మనందరి పాపాలను పోగొట్టి మనల్ని పవిత్రులను చేసేందుకే ఏసుక్రీస్తు ఈలోకానికి వచ్చాడని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించిన వారి విజయానికి ఆయన అండగా ఉంటారని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఈస్టర్ పండగను పురస్కరించుకుని మణికొండలోని ది లైఫ్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మనల్ని రక్షించేందుకు ఈ లోకానికి వచ్చారన్నారు. ఆయనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. బైబిల్‌లోని అంశాలపై ఆయన ప్రసంగించారు.

ఘనంగా విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, శ్యామలాదేవి దంపతులు

రాయదుర్గం: వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గచ్చిబౌలి డివిజన్‌లోని డైమండ్ హైట్స్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీవాసుల పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ, ఆయన సతీమణి శ్యామలాదేవి స్వామి వారిని దర్శించుకున్నారు. కాలనీవాసులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, స్థానికులు రామారావు, లక్ష్మణ్, కృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూలే జయంతికి భారీ ఏర్పాట్లు

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు ఉత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు పోతురాజు యాదయ్య మాదిగ తెలిపారు. ఆదివారం ఆయన భీమయ్య, డాక్టర్ శ్రీరాములు, జంగయ్య, క్యాసారం శంకర్‌రావు కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ఆవరణలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వైభవంగా శ్రీమల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని పెద్దగోల్కొండలో శ్రీమల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా బోనాల ఊరేగింపు, జాతర నిర్వహించారు. నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో దేవాలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, ఉప సర్పంచ్ స్వరూప, వార్డు సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో తిరగబడ్డ వ్యక్తిపై కేసు నమోదు

శంషాబాద్: ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకన్ డ్రైవ్‌కు సహకరించకుండా తిరగబడి బూతులు తిట్టిన వ్యక్తిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి కొత్వాల్‌గూడ సర్వీసు రోడ్డుపై డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తున్న కిరణ్‌చారి అనే వ్యక్తిని పరీక్షించి వీడియో తీస్తుండగా అతను పోలీసులకు దుర్భాషలాడటమేగాక ఫోన్ లాక్కుని కిందపడేశాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకులు

రాజేంద్రనగర్: బైక్‌పై రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టడమేగాక ఇదేమని ప్రశ్నించినందుకు స్నేహితులతో కలిసి కత్తులతో దాడి చేసిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..పహాడీ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ ఆలీ(28)తన స్నేహితుడు నదీమ్‌తో కలిసి బైక్‌పై వర్క్ షాప్‌కు వెళ్తుండగా అదే సమయంలో కయూమ్‌నగర్‌కు చెందిన అస్లాం రాంగ్‌రూట్‌లో బైక్‌పై వచ్చి వారిని ఢీ కొట్టాడు. దీంతో ఇమ్రాన్‌తో పాటు నదీమ్ అస్లాంను మందలించి అక్కడి నుంచి పంపించి వేశారు. వారు వర్క్‌షాప్‌లో పని నిమగ్నమై ఉండగా తన స్నేహితులతో కలిసి అక్కడికి వచ్చిన అస్లాం ఇమ్రాన్ ఆలీ, నదీమ్‌లపై కత్తులతో దాడి చేశారు. దీనిపై సమాచారం అందడంతో అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోం మంత్రికి సత్కారం

చార్మినార్: ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పురానాపూల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పెండ్యాల లక్ష్మణ్‌రావుతో పాటు చార్మినార్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు గోపీగౌడ్ తదితరులు ఆదివారం హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి సత్కరించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పుస్తే శ్రీకాంత్ పర్యవేక్షణలో ఇప్పటికే తమ తమ డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు మంత్రికి వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్‌తో కలిసి అత్తాపూర్, మారుతీనగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రెండు రోజులకు ఒకసారి గంటసేపు వచ్చే మంచినీరు ప్రస్తుతం 40 నిమిషాలు మాత్రమే వస్తున్నాయని, లో ప్రెజర్‌తో కారణంగా నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై మల్లారెడ్డి స్పందిస్తూ జలమండలి జీఎం చంద్రశేఖర్, మేనేజర్ వినయ్‌లకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. మంగళవారం ఉదయం మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పైపులైన్‌ను తనిఖీ చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మూసీ ప్రక్షాళన కమిటీ కన్వీనర్ సనివెళ్లి జయానంద్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజు పహిల్వాన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ సందర్భంగా అన్నదానం

బండ్లగూడ: ఈస్టర్ పండుగ సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాన్ బాస్కోలోని అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా క్యాథలిక్ రెడ్డి సంఘం వైస్ ప్రెసిడెంట్ మారంరెడ్డి, మైఖెల్‌రెడ్డి మాట్లాడుతూ మానవాళి సంక్షేమం కోసం క్రీస్తు పునరుద్ధరణ పొందిన పవిత్రమైన రోజు ఈస్టర్ అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి, తుమ్మా జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న క్యాథలిక్ రెడ్డి సంఘం సభ్యులు

గెలుపే లక్ష్యంగా పని చేయాలి




ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో రాజేంద్రనగర్ బీజేపీ కన్వీనర్ మహాలింగంగౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని రాజేంద్రనగర్ బీజేపీ కన్వీనర్ మహాలింగంగౌడ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రధాని నరేంద్రమోదీని మహాలింగంగౌడ్ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేయాలని ప్రధాని ఆదేశించినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఎప్పుడు ఏమి జరుగుతుందో.?

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు కుప్పలుతెప్పలుగా కేబుల్ వైర్లు, ఇంటర్నెట్, కరెంటు వైర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా పలు మార్లు వైర్లు కాలిపోతున్నాయని ఇళ్లల్లోని సామగ్రి కాలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైర్లను తొలగించాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ద్వారకానగర్‌లో విద్యుత్ స్తంభానికి చుట్టుకుని ఉన్న వైర్లు

ఏళ్లు గడుస్తున్నా అంతే..

- ఉప్పర్‌పల్లిలో డ్రైనేజీ సమస్యతో స్థానికుల అవస్థలు
- ధ్వంసమైన పైప్‌లైన్
- పట్టించుకోని అధికారులు



ఉప్పర్‌పల్లి ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు

రాజేంద్రనగర్: పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం ఉప్పర్‌పల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి ప్రధాన రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్‌లను ఆధునీకరించకపోవడంతో సమస్య నానాటికి తీవ్ర మవుతోంది.

ప్రతిసారి ఇదే తంతు...

గత కొన్నేళ్లుగా ఉప్పర్‌పల్లి చౌరస్తాలో డ్రైనేజీ సమస్య కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా నామమాత్రపు పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.

కోర్టు ముందే డ్రైనేజీ వరద

ఉప్పర్‌పల్లి చౌరస్తాలోని రాజేంద్రనగర్ కోర్టు సమీపంలోనే గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కోర్టుకు ప్రతి రోజు న్యాయవాదులు, ఉన్నతాధికారులు వస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి..

నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని వారు కోరుతున్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకిమేరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద వివిధ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో కార్వాన్ నియోజకవర్గంలో ముంపు బస్తీలు ఒక్కటి కూడా ఉండవన్నారు. బస్తీలు, కాలనీలకు ముప్పు ప్రమాదం తప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా టోలిచౌకి, గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌లలోని లోతట్టు ప్రాంతాలు గతంలో వర్షాలకు ముంపునకు గురయ్యేవన్నారు. ఆ ప్రాంతాల్లో భారీ వరదనీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. అదే విధంగా నానల్‌నగర్ డివిజన్‌లోని నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలలో సైతం కోట్లాది రూపాయలతో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయన్నారు. దీనికి తోడుగా టోలిచౌకి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్న హకీంపేట్‌లోని రక్షణశాఖ స్థలంలో ఉన్న బుల్కాపూర్ నాలను దారి మళ్లించడం జరుగుతుందని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. దీనివల్ల నానల్‌నగర్ డివిజన్‌లోని ఎన్నో బస్తీలకు ముంపు ప్రమాదం శాశ్వతంగా తప్పిపోతుందని ఆయన అన్నారు. అదే విధంగా టోలిచౌకి డివిజన్‌లోని శాతం తలాబ్ నిండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని, దీని నుంచి వరద నీరు ఎప్పటికప్పుడు ఖాళీ చేసేందుకు తూమును ఆధునీకరించడం జరిగిందన్నారు. దీనివల్ల నదీమ్ కాలనీ, విరాసత్ కాలనీలకు ముంపు పెట్టు తప్పిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, షేక్ అబ్దుల్లా, హబీబ్ చావూస్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.